క్లుప్తంగా

పంట నిల్వలో జాగ్రత్తలు తీసుకోవాలి

కురిచేడు: రైతులు పండించిన పంట నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన అధికారి సంధ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ-పంట నమోదుపై సోమవారం జాయింట్ అజమాయిషీ సమావేశం నిర్వహించారు. మిరప కాయల కళ్లాలను ఆమె పరిశీలించారు. సమావేశంలో రబీ కాలంలో వేసిన ప్రతి పంటను ఈ-పంటగా నమోదు చేయాలని, ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రకాశ్ కోరారు. పంట ఉత్పత్తులు ఎండ, వర్షంతో పాడవకుండా నిల్వ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్లు ఉపయోగపడతాయని సంధ్య తెలిపారు. వీటిని రాయితీపై మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వంద మంది లేదా అంతకంటే ఎక్కువ మంది రైతులు బృందంగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే 75 శాతం రాయితీ మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు పోరాడాలి

గిద్దలూరు రూరల్: కుష్టు వ్యాధి నివారణకు కలిసి పోరాడుదామని కె.ఎస్.పల్లె పీహెచ్సీ వైద్యాధికారి నాయబ్ రసూల్ పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ఎస్.పల్లె పీహెచ్సీలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని, అందులో భాగంగానే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్య సిబ్బంది ముంతాజ్, రమేష్, రంగయ్య పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ.. ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ముండ్లపాడు సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెంచయ్య అతడి స్నేహితుడు కలిసి గిద్దలూరు వైపు బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో చెంచయ్యతో పాటు అతడి స్నేహితుడికి గాయాలయ్యాయి. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుల సలహా మేరకు చెంచయ్యను మెరుగైన వైద్యం కోసం నంద్యాల తీసుకెళ్లారు.

రెండు లారీల ఢీ.. క్లీనర్‌కు గాయాలు

కంభం: ముందు వెళ్తున్న లారీని వెనుక వచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాలు.. కాకినాడ నుంచి టమోటా తీసుకెళ్లేందుకు ఓ లారీ గిద్దలూరు వెళ్తోంది. కంభం-జంగంగుంట్ల మధ్య నల్లవాగు సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయింది. క్లీనర్ శ్రీనుకు గాయాలయ్యాయి. డ్రైవర్ రాంబాబుకు ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

క్రైస్ట్ చర్చిలో హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమం



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని క్రైస్ట్ చర్చిలో జీసస్ లవ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య రక్షణ విషయాలపై వైద్యాధికారి షేక్ ఖాదర్ రసూల్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉండవచ్చని చెప్పారు.

కార్యక్రమంలో నేత్ర వైద్యులు డాక్టర్ మౌలా సుల్తానా, జీసస్ లవ్ మినిస్ట్రీస్ ఫౌండర్ గుర్రం శేఖర్, స్టీవెన్, కో ఆర్డినేటర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ అడుగు జాడల్లో నడవాలి



గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



త్రిపురాంతకం : గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: మహాత్ముని అడుగు జాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తమ కార్యాలయాల్లో గాంధీ చిత్ర పటానికి వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్య్రం కోసం లక్షలాది మంది ప్రాణత్యాగం చేశారని, వారి అడుగు జాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయేల్, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, ఉత్తమకుమార్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జంకె వెంకట నారాయణరెడ్డి, పంబి వెంకటరెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, శివారెడ్డి, గురవయ్య, గౌస్‌మోహిద్దీన్ పాల్గొన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, పాల్గొన్నారు. వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, ఆదిలక్ష్మి, కేశవరావు, పద్మ పాల్గొన్నారు. సాయి బాలాజీ పాఠశాలలో కరస్పాండెట్ పి.ప్రకాశరావు ఆధ్వర్యంలో, వాసవి విద్యానికేతన్‌లో డైరెక్టర్ కె.రంగయ్య ఆధ్వర్యంలో బాపూజీకి ఘన నివాళులర్పించారు.

తాళ్లూరు: మండలంలో గాంధీ వర్ధంతిని సోమవారం పలుచోట్ల నిర్వహించారు. గాంధీజీ నేటి అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, సర్పంచిలు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు వజ్జా శ్రీనివాసరావు, ఏపీఎం దేవరాజ్, ఏఈ మనోహర్ పాల్గొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో గాంధీకి ఘన నివాళులర్పించారు. వెలుగువారిపాలెం యూపీ పాఠశాల, తాళ్లూరు ఏబీసీ హైస్కూల్లో గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎంలు సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కురిచేడు: జాతిపిత గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి, అహింస, మానవ సేవను ఆయుధాలుగా తీసుకుని స్వాతంత్య్ర సమరంలో విజయం సాధించిన త్యాగమూర్తి మహాత్మా గాంధీ..అని కొనియాడారు. ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య, పాతకోట వెంకటేశ్వరరెడ్డి, కాటం రమణారెడ్డి, కొలూరి నరసింహులు, కె.గుర్నాథం, కె. బాలనాగయ్య, గంధం సుబ్బారావు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మహాత్మా గాంధీ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత మహాత్మ గాంధీ ఆశయాలతో ముందుకు సాగుదామని పలువురు అన్నారు. బీజేవైఎం నాయకులు శివారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, భరత్‌రెడ్డి, ప్రసన్నాంజనేయులు, ఈశ్వరరెడ్డి, రంగస్వామి, బ్రహ్మం, నారాయణ, వెంకట నారాయణ, రాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో సోమవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని సంజీవరాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: గాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముండ్లమూరులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దేవతి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కన్నెగండ్ల సుధాకర్, మాజీ సర్పంచ్ బేతపూడి బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీకి సంబంధించిన సుమారు రూ.లక్ష విలువ చేసే వివిధ రకాల 580 నోటు బుక్స్, స్టాంపులు ప్రదర్శనకు ఉంచారు. అనంతరం విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు.

త్రిపురాంతకం: స్థానిక వాసవీ ఆలయం వద్ద గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చీతిరాల హనుమంతరావు, గణపతి ఉత్సవ సమితి అధ్యక్షుడు కె.పూర్ణనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లికార్జునరావు, యువకులు పాల్గొన్నారు.

తర్లుపాడు: గాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జగన్‌బాబు ఆధ్వర్యంలో మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సత్యం, ధర్మం, అహింస మార్గంలో గాంధీ సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. నాయకులు జనార్దన్, హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు నేతాజీ, బ్రహ్మానందం, చెంచయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొదిలిలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అన్నదానం..మహాదానం

● మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: అన్ని దానల్లో అన్నదానం గొప్పదని, పేదవాడి ఆకలి తీర్చినప్పుడు ఉండే తృప్తి, సంతోషం దేనిలో రాదని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పొదిలి మండలం దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా దేవరపల్లి ఆంజనేయులు ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించడం భగవంతుడు వారికి ఇచ్చిన వరమన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో దాదాపు 750 మంది దివ్యాంగులున్నారన్నారు. వీరు చిన్న చిన్న పనులు చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు త్రీ వీలర్ వాహనాలు ఇచ్చే విధంగా సాయం చేయాలని విన్నవించారు. దివ్యాంగుల సేవ సమితి జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, కె.సుబ్బారావు, ఫిరోజ్, బందీ సాహెబ్, మహబూబ్ బాషా, ముల్లా జాకీర్, నారాయణరెడ్డి, పేరం కోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

తాళ్లూరు: చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రకృతి సాగు వ్యవసాయ ఉత్పత్తుల మేళా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏల సమావేశంలో మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించి ప్రోత్సహించే విధంగా పొదుపు సంఘ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.



మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

పాల వెల్లువను విజయవంతం చేయాలి

జేపీవీ పాల వెల్లువ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీఎం దేవరాజ్ కోరారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం ఆయన వీఓఏలతో సమావేశమయ్యారు. ఇచ్చిన లక్ష్యాల మేరకే కేంద్రాలు ప్రారంభించి పాలు సేకరించాలని కోరారు. పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని జీపీపీ పొలం బడి ఇన్‌స్ట్రక్షన్ అధికారి వి.రామకోటేశ్వరి సూచించారు. బొట్లపాలెంలో జీపీపీ పొలం బడిని ఆమె సోమవారం సందర్శించారు. రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతు పరిజ్ఞానం కోసం బ్యాలెట్ బాక్స్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎరువులు, పురుగు మందులు, వాటి ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించామని ఆమె చెప్పారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.ప్రభాకర్, డీఆర్సీ నిర్మల, వ్యవసాయాదికారులు సుచరిత, స్వర్ణలత, బాలకృష్ణ నాయక్, రమణ, మాల్యాద్రి, వీఏఏలు షేక్ మాసుం బాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకోటేశ్వరి

చిరుధాన్యాలపై అవగాహన

తర్లుపాడు: చిరు ధాన్యాల్లో అత్యధిక పోషక విలువలు ఉన్నాయని, వాటి ద్వారా పౌష్టికాహార లోపాలను అధిగమించవచ్చని ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌బీకేలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఒకప్పుడు పేదవారి ఆహారంగా నిరాధారణకు గురైన చిరుధాన్యాలు కరోనా తర్వాత అన్ని వర్గాలకు చేరువయ్యాయన్నారు. ఏడీఏ రాజరాజేశ్వరి మాట్లాడుతూ పోషకాహారంతో ఆహార భద్రతను సాధించే లక్ష్యంతో 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించాలనే భారత్ ప్రతిపాదనను ఐక్యారాజ్యసమితి ఆమోదించిందన్నారు. ఏడీఏ డి.శ్రీనివాసులు, ఏవో చంద్రశేఖర్, టెక్నికల్ ఏవో మాల్యాద్రి, రమణ పాల్గొన్నారు.

మార్కాపురం: చిరు ధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి అన్నారు. మండలంలోని కొండెపల్లిలో చిరుధాన్యాల సాగుపై రైతులకు సోమవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ అన్ని మండలాలు చిరుధాన్యాల సాగుకు అనుకూలంగా ఉంటాయన్నారు. తక్కువ నీరు, పెట్టుబడి, తక్కువ ఎరువులతో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, వరిగ, ఆరిక పంటల గురించి ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు వివరించారు. ఏవో రమణ, టీఏవో మాల్యాద్రి, శ్రీనివాసులు, హైమావతి పాల్గొన్నారు.



తర్లుపాడు: చిరుధాన్యాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

ప్రొటోకాల్ విస్మరించడంపై ఎంపీపీ ఆగ్రహం

తాళ్లూరు: వైద్యశాల అభివృద్ధి కమిటీ వ్యవహారంలో ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్న తూర్పుగంగవరం పీహెచ్సీ వైద్యాధికారి బి.రత్నంపై ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాలలో జరుగుతున్న నియామకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై సరైన సమాచారం ఇవ్వక పోవడంపై ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తూర్పుగంగవరం పీహెచ్సీలో ప్రభుత్వం మంజూరు చేసిన బయోకెమికల్ ఎన్‌లైజర్‌ను సోమవారం స్థానిక నాయకులతో కలిసి వైద్యుడు ప్రారంభించినట్లు తన దృష్టికి వచ్చిందని ఎంపీపీ చెప్పారు. ఈ విషయమే కాకుండా గతంలో ఆశ కార్యకర్తల నియామకం కూడా ఇష్టానుసారంగా చేశారని ఎంపీపీ మండిపడ్డారు. ఈ విషయమై పీహెచ్సీ వైద్యాధికారి బి.రత్నాన్ని వివరణ కోరగా తాను ఎటువంటి పరికరాన్ని ప్రారంభించ లేదని, త్వరలోనే ఎంపీపీని పిలిచి ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.



ఎన్‌లైజర్‌ను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

ప్రభుత్వ పథకాలను పరిశీలించిన ఎన్ఎల్ఎం టీం

యర్రగొండపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని నలుగురు సభ్యులు గల ఎన్ఎల్ఎం(నేషనల్ మానిటరింగ్)టీం సోమవారం పరిశీలించింది. ఈ మేరకు బోయలపల్లి, గోళ్లవిడిపి గ్రామాల్లో వారు విస్తృతంగా పర్యటించి లబ్ధిదారులను విచారించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఐసీడీఎస్, పీఎంఎంఈవై, పీఎంఏవైజీ, హౌసింగ్, హెల్త్, వైఎస్సార్ క్రాంతి పథం పథకాల లబ్ధిదారులతో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పథకాల గురించి ఆరా తీశారు. స్వయం సహాయక సంఘాలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకున్నారు. టీం సభ్యుడు అంబటి శ్రీనివాసులుతోపాటు మరో ముగ్గురు ఎన్ఎల్ఎం సభ్యులు పాల్గొన్నారు. వారివెంట ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు ఉన్నారు.



లబ్ధిదారులను విచారిస్తున్న ఎన్ఎల్ఎం టీం

రేపటి నుంచి నరసింహస్వామి పుట్ట తిరునాళ్ల

పెద్దారవీడు: మండలంలో తోకపల్లె గ్రామంలో సద్గురు యోగానంద నరసింహస్వామి 67వ పుట్ట తిరునాళ్లను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి అభిషేకాలు, పంచామృతాభిషేకం, మంత్రపుష్ప నీరాజనం, ప్రసాద వినియోగం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని అర్చకులు కె.భవానీప్రసాద్ చెప్పారు. 1వ తేదీన ఉదయం 9 నుంచి 11 వరకు దీక్షాస్వాముల ఇరుముడి, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, ఆలయం ప్రాంగణంలో 4 గంటలకు దీక్షాస్వాములతో హోమం అనంతరం దీక్ష విరమణ, భారత కోలాటం, రాత్రి భక్తప్రహ్లాద నాటకం, 2వ తేదీన సాయంత్రం 4 గంటలకు భరత నాట్యం, మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పెద్ద పీఆర్సీ తండాలో గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండలంలోని పెద్ద పీఆర్సీ తండా సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ముందుగా యండ్రపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు



గ్రంథాలయానికి వచ్చిన కొత్త పుస్తకాలు

బేస్తవారిపేట: బేస్తవారిపేట, కంభం గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు వచ్చాయి. బేస్తవారిపేట గ్రంథాలయానికి 1658, కంభానికి 1826 పుస్తకాలు వచ్చాయి. వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు వాటిలో ఉన్నాయి. నాయకుల జీవిత చరిత్రలు, ఆయుర్వేదం, హోమియో, సిద్ధవైద్యం, రామాయణం, మహాభారతం, కార్టూన్స్, కథలు, లెక్కలు, ఇంగ్లిష్, తెలుగు, హిందీకి సంబంధించిన పుస్తకాలు, ప్రసిద్ధ తెలుగు నాటికలు, హాస్య కథలు ఉన్నాయి. కొత్తగా వచ్చిన పుస్తకాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు.

ఉపాధి పనులు గుర్తించాలి

తాళ్లూరు: ఉపాధి పనులను త్వరగా గుర్తించాలని డ్వామా ఏపీడీ పద్మశ్రీ ఆదేశించారు. స్థానిక ఉపాధి పథకం కార్యాలయంలో ఏపీఓ మురళి, సిబ్బందితో సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, అధిక సంఖ్యలో కూలీలు పాల్గొనేలా తగిన చర్యలు పారదర్శకంగా తీసుకోవాలని సూచించారు. ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.

సిటిజన్ ఔట్ రీచ్ సర్వే సక్రమంగా చేయాలి

పుల్లలచెరువు: సిటిజన్ ఔట్ రీచ్ సర్వేను వలంటీర్లు సక్రమంగా చేయాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి సూచించారు. సోమవారం ఎంపీడీఓ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. కొందరు వలంటీర్లు సర్వేను అశ్రద్ధ చేస్తున్నారని, పని చేయడం ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. తమ పరిధిలోని అర్హులకు ప్రభుత్వ పథకాల సమాచారం తెలియజేయాలని వలంటీర్లకు సూచించారు. కొందరు వలంటీర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని, సక్రమంగా పనిచేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వలంటీర్ల పనితీరుపై నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లుకు సూచించారు.

ఇల్లు కూల్చివేతలో వైఎస్సార్ సీపీ నేతలకు సంబంధం లేదు

మార్కాపురం: ఏకలవ్య కాలనీలో ఉన్న తన స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇంటిని మాత్రమే తొలగించామని, అందులో వైఎస్సార్ సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని మందా పెద్ద ఆవులయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పేరుతోనే ఇంటి పట్టా ఉంటే నకిలీ పట్టా పుట్టించి తనదంటూ ఇబ్బంది పెడుతుంటే పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని, వారు విచారించి తన పేరుపైనే పట్టా ఉన్నట్లు లిఖితపూర్వకంగా ఇచ్చారని ఆవులయ్య తెలిపారు. వాస్తవాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

కరాటే పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

మార్కాపురం టౌన్: జాతీయ స్థాయి కరాటే పోటీలకు పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మాస్టర్ తోట ప్రసాద్ సోమవారం తెలిపారు. ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సాయి ప్రణవి, హుస్సేన్‌బాషా, జస్వంత్‌రెడ్డిలను పలువురు అభినందిచారు.

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

పెద్దదోర్నాల: ఉపాధి పనులకు వెళ్తున్న మహిళలను కారు ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన చిన్నదోర్నాల వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న తంగిరాల బేబి తీవ్రంగా గాయపడగా దోర్నాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమెను మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేశారు.

దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు: కనిగిరి తహసీల్దార్ పుల్లారావుపై దురుసుగా ప్రవర్తించిన సర్పంచి గురవయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దార అంజయ్య డిమాండ్ చేశారు. తాళ్లూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అంజయ్య హెచ్చరించారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

మార్కాపురం టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో చందన అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్‌తో ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంస పత్రాలు పొందిన వి.శ్రీనివాస్, వెంకటేశ్వరమ్మలను సోమవారం రాత్రి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో అవార్డులు తీసుకోవాలని కోరారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కొండయ్య, ఎంఈవో రాందాస్‌నాయక్, ఈవో పీఆర్‌డీ రామమోహన్‌రెడ్డి, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రాజ్, రమణారెడ్డి, సరోజని, వంశీ పాల్గొన్నారు.